జగిత్యాలలో బీఆర్ఎస్ పైచేయి

- జగిత్యాల, కోరుట్లలో గెలుపు
- ధర్మపురిలో కాంగ్రెస్ విజయం
- జగిత్యాలలో 15,822 ఓట్లతో రెండోసారి డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్
- తొలి ప్రయత్నంలోనే కోరుట్ల ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఆరో ప్రయత్నంలో విజయాన్ని అందుకున్న ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి

జగిత్యాల, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా, ఒక్క నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ వరుసగా రెండోసారి జయకేతనం ఎగురవేయగా, కోరుట్ల నియోజకవర్గం నుంచి తొలిసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గెలిచారు. ఆరోసారి చేసిన ప్రయత్నంలో ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజయాన్ని దక్కించుకున్నారు.

15,822 ఓట్ల మెజార్టీతో జగిత్యాలలో డాక్టర్ సంజయ్‌కుమార్ జయకేతనం

కాంగ్రెస్ కురువృద్ధుడు, రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డిపై బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ వరుసగా రెండోసారి జయకేతనం ఎగురవేశారు. గత నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఓట్లను ఆదివారం మల్యాల మండలం నూకపెల్లి శివారులోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో లెక్కించారు. ఉదయం 8 గంటలకు జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం పోస్టల్ బ్యాలెట్‌లతో ఆరంభమైంది. మొదటి 10 రౌండ్ల వరకు స్వల్పంగా ఆధిక్యతను ప్రదర్శించిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, 11వ రౌండ్ నుంచి చివరి రౌండ్ అయిన 19వ రౌండ్ వరకు వెనుకబడిపోయారు. జగిత్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ 70,243 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి 54,421 ఓట్లను పొందారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ బోగ శ్రావణి 42,138 ఓట్లను సంపాదించారు. మొత్తంగా 15,822 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ గెలిచారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,31,468 ఓట్లు ఉండగా, 1,76,369 ఓట్లు పోలయ్యాయి.

ఆరో ప్రయత్నంలో అడ్లూరి గెలుపు

ధర్మపురి నియోజకవర్గం నుంచి ఆరోసారి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎట్టకేలకు విజయం సాధించారు. 2008లో తొలిసారి మేడారం రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై ఓటమి చెందారు. 2009లో శాసనసభ స్థానాల పునర్విభజన తర్వాత ధర్మపురి నియోజకవర్గం నుంచి మళ్లీ అడ్లూరి, కొప్పుల పోటీ పడగా, కొప్పుల ఈశ్వర్ రెండోసారి విజయం సాధించారు. 2010లో ఉప ఎన్నికలో వీరిద్దరే మరో సారి తలపడగా, వరుసగా ఈశ్వర్ మూడోసారి గెలిచారు. 2014లో నాలుగోసారి, 2018 లో ఐదోసారి సైతం ఇద్దరు పోటీ పడగా, కొప్పుల ఈశ్వర్ వరుసగా విజయాన్ని అందుకున్నారు. కాగా ఆరోసారి సైతం ఇద్దరు ధర్మపురి నియోజకవర్గ బరిలో నిలువగా ఈ సారి మాత్రం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజయాన్ని అందుకున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 91,393 ఓట్లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 69,354 ఓట్లు వచ్చాయి. 22,039 ఓట్ల మెజార్టీతో అడ్లూరి విజయం సాధించారు. నియోజకవర్గంలో 2,26,880 ఓట్లు ఉండగా, 1,81,690 ఓట్లు పోలయ్యాయి.

తొలి ప్రయత్నంలో సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తొలి ప్రయత్నంలోనే విజయాన్ని దక్కించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా ఉన్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వృద్ధాప్య సమస్యల నేపథ్యంలో పోటీకి దూరంగా ఉంటానని ప్రకటించడంతో తన కొడుకు డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను బీఆర్ఎస్ బరిలోకి దింపింది. తొలి ప్రయత్నంలోనే డాక్టర్ సంజయ్ కోరుట్ల ఎమ్మెల్యేగా విజయం సాధించారు. సంజయ్‌కు 72,115 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థిగా నిలిచిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు 61,810 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జువ్వాడి నర్సింగరావుకు 39,647 ఓట్లు దక్కాయి. డాక్టర్ సంజయ్ 10305 ఓట్ల మెజార్టీతో జయకేతనం ఎగరేశారు. నియోజకవర్గంలో 2,40,855 ఓట్లు ఉండగా, 1,83,590 ఓట్లు పోలయ్యాయి.

రాయికల్: పటాకులు పేలుస్తున్న నాయకులు

సారంగాపూర్: ఎమ్మెల్సీ రమణతో నాయకులు

బీఆర్ఎస్ గెలుపుపై సంబురాలు

- జగిత్యాలలో మాకునూరి సంజయ్, కోరుట్లలో సంజయ్ కల్వకుంట్ల గెలవడంపై శ్రేణుల హర్షం
- కేక్ కట్ చేసి స్వీట్లు పంచిన నాయకులు

సారంగాపూర్, డిసెంబర్ 3: జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్ రెండోసారి విజయం సాధించడంపై బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి పటాకలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణను కలిసి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్, డిసెంబర్ 3: జగిత్యాల ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కుమార్ గెలుపుపై పట్టణంలోని అంగడిబజార్లో ఆదివారం నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పటాకలు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మారుతీనగర్, డిసెంబర్ 3: కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గెలుపొందడంపై ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని ఆయా వార్డుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పటాకలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

మల్లాపూర్, డిసెంబర్ 3: కోరుట్ల ఎమ్మెల్యేగా సంజయ్ కల్వకుంట్ల గెలుపొందడంపై మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పటాకలు కాల్చి గ్రామస్తులకు స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 3 : మండలకేంద్రంతో పాటు గోదూర్, పలు గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం నాయకులు, ఎంపీపీ జాజాల భీమేశ్వరి పటాకలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు సోమ ప్రభాకర్, సంఘం సాగర్, నాయకులు జాజాల జగన్ రావు, నేమూరి సత్యనారాయణ, రెబ్బాటి రాజేందర్, జేడీ సుమన్, చిన్నారెడ్డి, నల్ల తిరుపతిరెడ్డి, పురుషోత్తం, నేరెళ్ల దేవేందర్, భూక్యా విజయ్, తలారి ఆనంద్, స్వామి, గంగాధర్, అనంతం, రాజేందర్, జలేంధర్, రాజన్న, నాగరాజు, నేమూరి నరేశ్, అలిశెట్టి మోహన్, బొమ్మెన గణేశ్, వాల్గొట్ నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

కోరుట్ల రూరల్, డిసెంబర్ 3: కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల గెలవడంపై ఆదివారం అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద పటాకలు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సంతోషం వ్యక్తం చేస్తున్న సంజయ్ సతీమణి రాధిక, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాల కోసం నిరీక్షిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కౌంటింగ్ కేంద్రం భద్రతా బలగాలు